క్లుప్తంగా

మామిడికి మార్కెట్ సౌకర్యం కల్పిస్తాం



రైతులతో సమావేశమైన జిల్లా హార్టికల్చర్ అధికారి చంద్రశేఖర్

పెనుకొండ: బేనీషా మామిడికి తగిన మార్కెట్ సౌకర్యం కల్పిస్తామని జిల్లా హార్టికల్చర్ అధికారి చంద్రశేఖర్ పేర్కొన్నారు. పట్టణంలోని హార్టికల్చర్ కార్యాలయంలో మంగళవారం ఆయన రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి రైతులకు అన్ని విధాల అందుబాటులో ఉండటమే కాకుండా భవిష్యత్తులో ఎలాంటి సమస్య లేకుండా కొనుగోలు చేస్తామన్నారు.

డీఎస్సీ పరీక్షకు ఉచిత శిక్షణ

పెనుకొండ: మెగా డీఎస్సీ పరీక్షలకు సంబంధించి నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ అధికారి గంగాధర్ తెలిపారు. టెట్‌లో పరీక్ష అర్హత సాధించిన ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మార్కుల జాబితా, ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, పాస్‌పోటోలు, ఇతర వివరాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

13న గురుకుల ప్రవేశ పరీక్ష

రొళ్ల: దొమ్మరహట్టి సమీపంలోని 544ఈ జాతీయ రహదారి పక్కన ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 13న పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ మైలారప్ప తెలిపారు. 5వ తరగతి విద్యార్థులకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను హాల్‌టికెట్‌తో పాటు ఒరిజినల్ ఆధార్‌కార్డుతో పరీక్ష కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు అందుబాటులో ఉన్నాయని, డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను ఆహ్వానిస్తున్న రత్నగిరి సంస్థానం దొర రంగప్పరాజు

రొళ్ల: మండల పరిధిలోని రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి బ్రహ్మోత్సవాలు ఈనెల 13వ తేదీ నుంచి 21వ తేదీ వరకూ అత్యంత వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు రాజవంశీకుడు దొర రంగప్పరాజు, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ చైర్మన్ బోయ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త బోయ శాంతమ్మ, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో పాటు స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజును ఆహ్వానించినట్లు దొర రంగప్పరాజు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో రాముడి విగ్రహ ప్రతిష్ట



పట్టాభి రామయ్య ఆలయంలో విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న భక్తులు

గోరంట్ల: మండల పరిధిలోని బూడిదగడ్డపల్లిలో రూ.1.5 కోట్ల వ్యయంతో అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, ఎస్ఆర్ఐ వనజ శేషాద్రిరెడ్డి దాతృతంతో నూతనంగా నిర్మించిన పట్టాభి రామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ట వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. మంగళవారం ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేలాది మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం శేషాద్రిరెడ్డి కుటుంబ సభ్యులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణాన్ని జరిపించారు.

సర్వే వేగవంతం చేయండి

రొళ్ల: మండల వ్యాప్తంగా వివిధ సచివాలయం పరిధిలో పెండింగ్‌లో ఉన్న సర్వేను త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని పెనుకొండ డీఎల్‌పీఓ, మండల స్పెషల్ ఆఫీసర్ శివనారాయణరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశం మందిరంలో సచివాలయాల సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయం సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకుని సర్వేను పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.

అడుగడుగునా నీరాజనం

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున రామగిరి మండలం పాపిరెడ్డిపల్లికి తరలివెళ్లారు. ద్విచక్ర వాహనాలు, కార్లు, వివిధ వాహనాల్లో మంగళవారం ఉదయమే బయలు దేరారు. వైఎస్సార్‌సీపీ జెండాలు చేత పట్టి జై జగన్ నినాదాలతో హోరెత్తించారు.

- వైఎస్సార్‌సీపీ అధినేతను చూసేందుకు భారీగా తరలివచ్చిన అభిమానులు
- జనమయమైన సోమందేపల్లి, పాలసముద్రం, పెనుకొండ, బాగేపల్లి టోల్‌గేట్ ప్రాంతాలు

చిలమత్తూరు: రాప్తాడు పర్యటన ముగించుకొని తిరుగు ప్రయాణంలో వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 44వ నంబరు జాతీయ రహదారిపై రోడ్డు మార్గంలో వస్తున్నారన్న సమాచారంతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు చిలమత్తూరు మండల సరిహద్దు బాగేపల్లి టోల్ ప్లాజా వద్ద భారీగా చేరుకొన్నారు. ఆయన వాహనం కనపడగానే ఆయనన్ను చూసేందుకు ఎగబడ్డారు. అభిమానులను చూడగానే వైఎస్ జగన్ కారుపై నుంచి అభివాదం చేశారు. ఆయనతో కరచలనం చేసేందుకు అభిమానులు పోటీ పడ్డారు. బాగేపల్లి పోలీసులు అభిమానులు, కార్యకర్తలను నిలువరించేందుకు అవస్థలు పడ్డారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ నేత వేణు రెడ్డి, కదిరి నియోజకవర్గ సమన్వయకర్త మక్బుల్, మెట్టు విశ్వనాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, మున్సిపల్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ ఆసిపుల్లా, రాష్ట్ర కురుబ వర్కింగ్ ప్రెసిడెంట్ శివ, మహేష్‌గౌడ్, చంద్రశేఖరరెడ్డి, గిరిధర్‌రాజు, అమడగూరు మంజునాథ్‌రెడ్డి, విష్ణువర్దన్ రెడ్డి, శ్రీనాథ్, నరసింహారెడ్డి, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బెంగళూరుకు రోడ్డు మార్గంలో వెళ్తున్న విషయం తెలుసుకున్న మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు మండల పరిధిలోని పాలసముద్రం క్రాస్ వద్దకు భారీగా తరలివెళ్లారు. వైఎస్ జగన్ వాహనం రాగానే పెద్ద ఎత్తున జగన్ నినాదాలు చేశారు. ఆయన కాన్వాయ్ ఆపి అభిమానులు అభివాదం చేస్తూ ముందుకు సాగారు.

పెనుకొండ రూరల్: పెనుకొండ జాతీయ రహదారి మీదుగా వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ బెంగళూరు వెళ్తున్నారని తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెనుకొండ వై జంక్షన్ వద్దకు భారీగా చేరుకున్నారు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఎండ దంచి కొడుతున్నా లెక్కచేయకుండా జననేతను చూసేందుకు తరలివెళ్లారు. వైఎస్ జగన్ కాన్వాయ్ రాగానే పెద్ద ఎత్తున కేరింతలు కొట్టారు. వైఎస్సార్‌సీపీ వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర కార్యకర్తలతో కలసి ఆయనకు ఘన స్వాగతం పలికారు. ప్రజలకు అభివాదం చేస్తూ వైఎస్ జగన్ ముందుకు సాగారు.

సోమందేపల్లి: రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి పర్యటన ముగించుకొని బెంగళూరు వెళ్తున్న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కలిశారు. స్థానిక వైఎస్సార్ సర్కిల్ వద్ద జాతీయ రహదారిపై ఆయన కాన్వాయ్ ఆపడంతో ఆయనతో కరచలనం కోసం ఎగబడ్డారు. అభివాదం చేస్తూ వైఎస్ జగన్ ముందుకు సాగారు.

పాపిరెడ్డిపల్లికి తరలిన నాయకులు

చిలమత్తూరు: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి పర్యటన నేపథ్యంలో హిందూపురం నుంచి పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలివెళ్లాయి. హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాల్లో నేతలు, కార్యకర్తలు వెళ్లారు. ఆగ్రోస్ మాజీ చైర్మన్ బి.నవీన్ నిశ్చల్, మహిళా నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డి వైఎస్ జగన్ పర్యటనకు హాజరయ్యారు. చిలమత్తూరులో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, కొడూరులో వైఎస్సార్‌సీపీ నేతల ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పాపిరెడ్డిపల్లికి వెళ్లాయి.



బాగేపల్లి టోల్‌ప్లాజా వద్దకు భారీగా తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తలకు అభివాదం చేస్తున్న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

మడకశిరరూరల్: రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి గ్రామంలో హత్యకు గురైన కురుబ లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించడానికి విచ్చేసిన మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ పర్యటనకు నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప నాయకులతో కలిసి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి బయలు దేరి వెళ్లారు. మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వక్కలిగ విభాగం అధ్యక్షుడు రంగేగౌడ్, జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి, బీసీ సెల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు సత్యనారాయణయాదవ్, మండల కన్వీనర్ రామిరెడ్డి, ఎంపీపీ కవిత, ఎంపీటీసీ మాల్లేరంగప్ప, కురుబ సంఘం నాయకుడు శేషాద్రి, వక్కలిగ నాయకులు హనుమంతరాయప్ప, నటరాజ్, నాగభూషణ్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, నరేష్‌రెడ్డి, నరసింహ, సికిందర్, మంజునాథ్, రంగనాథ్, రవి, చిరంజీవి,హరి, మల్లికార్జున, గిరిష్, తిప్పేస్వామి, గోపి తదితరులు వెళ్లారు.

అగళి: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో నుంచి సమన్వయకర్త ఈరలక్కప్ప పిలుపుమేరకు రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో మాజీ సీఎం జగన్ పర్యటనకు మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మహేంద్రప్ప, జిల్లా ఆర్గనైజర్ సెక్రటరీ జయకుమార్, నాయకులు నాటరాజు, సతీస్, గంట నాగరాజు, శీనప్ప, కాంతరాజు, గంగధర్, లింగరాజు, గిరిష్, ఈరన్న, పవన్, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు.

మడకశిర: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మంగళవారం రాప్తాడు నియోజకవర్గంలోని పాపిరెడ్డిపల్లి గ్రామంలో పర్యటించారు. ఈ పర్యటనలో మడకశిర నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పార్టీ సమన్వయకర్త ఈరలక్కప్ప పార్టీకి సంబంధించిన ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. మాజీ మంత్రి నర్సేగౌడు, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు గోవర్ధన్‌రెడ్డి, రవిశేఖర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి, రాష్ట్ర కుంచిటి వక్కలిగ విభాగం అధ్యక్షుడు రంగేగౌడు, రొళ్ల, గుడిబండ మండలాల జెడ్పీటీసీలు అనంతరాజు, భూతరాజు తదితరులు వైఎస్ జగన్ పర్యటనలో పాల్గొన్నారు.

అమరాపురం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో పర్యటించారు. మండలం నుంచి ఎంపీపీ ఈరన్న, మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్, ఎంపీటీసీలు నాగభూషణ, హనుమంతరాయ, ధనుంజయ, సర్పంచులు, వైఎస్సార్‌సీపీ నాయకులు చిత్తప్ప, అమరీష్‌బాబు, ఓబిలేసు, నారాయణమాదిగ, జేకే.మూర్తి, జోగింద్ర, మంజునాథ, నంజుండప్ప, రామచంద్రప్ప, తిప్పయ్య, బి.డి.నరసింహమూర్తి, యంజేరప్ప, రసూల్‌భాష, నరసింహరాజు, మంజునాథ, కిరణ్, దేవేంద్ర, వీరాపురం సురేష్ తదితరులు తరలి వెళ్లారు. అనంతరం కురుబ లింగమయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

రొళ్ల: మండలం నుంచి రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి పర్యటనకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, పార్టీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, జిల్లా కార్యదర్శి లోకేష్, వైస్ సర్పంచ్ రవికుమార్, నాయకులు నగేష్‌రంగారెడ్డి, విజయరంగేగౌడు, ప్రకాష్, ప్రసన్నకుమార్, శశికుమార్, ముద్దారెడ్డి, మంజునాథ్ తదితరులు వెళ్లారు.

జగన్ పర్యటన విజయవంతమైంది

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిర: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ పాపిరెడ్డిపల్లి పర్యటన విజయవంతంగా జరిగిందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప తెలిపారు. కూటమి నాయకులు వైఎస్ జగన్ పర్యటనకు ఎన్నో అడ్డంకులు సృష్టించారన్నారు. పోలీసులు కూడా నాయకులు, కార్యకర్తలు పర్యటనకు వెళ్లకుండా ఎన్నో ఆంక్షలు విధించారని పేర్కొన్నారు. అయినా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి వైఎస్ జగన్ పర్యటనను విజయవంతం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా హత్యా రాజకీయాలను మానుకోవాలని హితవు పలికారు. లేకపోతే ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని హెచ్చరించారు. మడకశిర నియోజకవర్గం నుంచి వైఎస్ జగన్ పర్యటనకు పెద్ద ఎత్తున వచ్చి విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



హిందూపురం: పార్టీ కార్యాలయం వద్ద నుంచి బయలుదేరి వెళ్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక, పార్టీ శ్రేణులు



మడకశిర: వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప ఆధ్వర్యంలో తరలివెళ్తున్న పార్టీ శ్రేణులు



సోమందేపల్లి: అభివాదం చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



వైఎస్ జగన్ పర్యటనలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప తదితరులు



అగళి: పాపిరెడ్డిపల్లికి వెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పాపిరెడ్డిపల్లిలో లింగమయ్య కుటుంబ సభ్యులను పరామర్శించిన వైఎస్సార్‌సీపీ నాయకులు

రెండు కేజీల చికెన్ కొంటే కేజీ ఫ్రీ

- ప్రజారోగ్యంతో కోళ్ల వ్యాపారుల చెలగాటం
- దుకాణాలను మూయించిన మున్సిపల్ అధికారులు



రోగాల బారిన పడిన కోడిని పరిశీలిస్తున్న మున్సిపల్ అధికారులు



ఫ్రిడ్జిలో పెట్టిన చికెన్‌ను బయటకు తీసుకువచ్చి పరిశీలిస్తున్న మున్సిపల్ అధికారులు

హిందూపురం టౌన్: రెండు కేజీల చికెన్ కొంటే కేజీ చికెన్ ఫ్రీ .. బంపర్ ఆఫర్ అంటూ హిందూపురం పట్టణంలో చికెన్ వ్యాపారులు రోగాలు సోకిన కోళ్లతో వ్యాపారానికి తెరతీశారు. మంగళవారం పట్టణంలోని వాల్మీకి సర్కిల్, సదాశివ నగర్, మేళాపురం తదితర ప్రాంతాలలో కోళ్ల వ్యాపారులు, మటన్ వ్యాపారులు రోగాలు సోకిన కోళ్లను తీసుకొచ్చి బంపర్ ఆఫర్ పేరుతో విక్రయించారు. రెండు కేజీలు చికెన్ కొంటె ఒక కేజీ ఉచితం అని అమ్మకాలు సాగించారు. అలాగే అన్ని ప్రాంతాల్లోనూ కేజీ మటన్ ధర రూ.800 పలుకుతోంది. అయితే పట్టణంలోని బెంగళూరు రోడ్డులో ఉన్న ఓ దుకాణంలో కేజీ రూ.500 కే విక్రయించారు. ముఖ్యంగా కోళ్ల ఫారాలలో కోళ్ల పెరుగుదల కోసం ఇంజక్షన్లు వేస్తారు. అలా ఇంజక్షన్లు వేసే సమయంలో కొన్ని కోళ్లకు ఇంజక్షన్ వేసిన చోట ఇన్‌ఫెక్షన్ సోకి చీము పడతాయి. అలాంటి కోళ్లను కోళ్ల ఫారాలు నిర్వహించేవారు తక్కువ ధరకు వ్యాపారులకు విక్రయిస్తారు. అలాంటి నాసిరకమైన కోళ్లను తీసుకొని వచ్చి ఆఫర్ల పేరుతో పట్టణంలో చికెన్ వ్యాపారులు విక్రయిస్తున్నారు. ఏమాత్రం గమనించకుండా మాంస ప్రియులు తక్కువ ధరకు చికెన్ వస్తుందని కొనుగోలు చేసి తిని అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారు. ఇదే మాంసాన్ని పట్టణంలో చికెన్ వ్యాపారులు కబాబ్ సెంటర్, బార్ అండ్ రెస్టారెంట్లకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న మున్సిపల్ అధికారులు వాల్మీకి సర్కిల్‌లో బంపర్ ఆఫర్ పేరుతో వ్యాపారాలు చేస్తున్న చికెన్ షాపులతో పాటు మరికొన్ని మటన్, చికెన్ షాపులపై దాడులను నిర్వహించారు. రోగాలు సోకిన కోళ్లు, ఫ్రిజ్‌లో ఉంచిన కోడి మాంసం, పొట్టేలు మాంసాన్ని విక్రయిస్తున్నట్లు బయటపడింది. అధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించి మాంసాన్ని ల్యాబ్‌కు పంపనున్నట్లు అధికారులు తెలిపారు. ఫ్రిడ్జిలో ఉంచిన చికెన్, మటన్‌ను వారు ధ్వంసం చేశారు. అలాగే షాపులను మూయించారు. దాడుల్లో మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జనార్దన్, మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామాంజనేయులు, శానిటేషన్ సెక్రటరీ శివకుమార్ ఇతర మున్సిపల్ అధికారులతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

సందడిగా ఉట్ల పరుష



నీలకంఠాపురంలో ఉట్ల మాను ఎక్కుతున్న యువకులు

మడకశిరరూరల్: మండల పరిధిలోని నీలకంఠాపురంలో మంగళవారం సాయంత్రం ఉట్ల పరుష వైభవంగా జరిగింది. మహిళలు భక్తి శ్రద్ధలతో జ్యోతులను ఊరేగింపుగా తీసుకొచ్చి సీతారాములకు సమర్పించి పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయం వద్ద నిర్వహించిన ఉట్లమాను ఉత్సవం సందడిగా జరిగింది.

పీయూసీ ఫలితాల్లో ప్రతిభ



రాజా యదు వంశీ యాదవ్, లక్ష్మీ, సౌందర్య, యువనిక, కావ్య

పావగడ: తాలూకాలోని వైఎస్ హొసకోట హోబళిలోని కుగ్రామం ఇంద్రబెట్టకు చెందిన న్యాయవాది ప్రభు లింగే గౌడ కుమారుడు రాజా యదు వంశీ యాదవ్ ద్వితీయ పీయూసీ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించాడు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో రాజా యదు వంశీ యాదవ్ 600 మార్కులకు గాను 598 మార్కులు సాధించాడు. అలాగే పట్టణంలోని స్వామి వివేకానంద ఎయిడెడ్ కళాశాలకు చెందిన సైన్స్ విభాగం విద్యార్థిని కెంచన్నగారి సౌందర్య 600 మార్కులకు గాను 568 మార్కులు సాధించి తాలూకా టాపర్‌గా నిలిచింది. యువనిక 600 మార్కులకు గాను 561 మార్కులు సాధించి సెకండ్ టాపర్‌గా నిలిచింది. ఎస్ఎస్‌కే శాంతి పీయూ కళాశాలకు చెందిన వాణిజ్య విభాగం విద్యార్థిని కావ్య 600 మార్కులకు గాను 558 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది.

మడకశిర: పట్టణానికి చెందిన లక్ష్మీ అనే విద్యార్థిని కర్ణాటకలో పీయూసీ పరీక్షల్లో అత్యంత ప్రతిభను కనబరచింది. మంగళవారం పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. లక్ష్మీ రాష్ట్రస్థాయి 7వ ర్యాంక్ సాధించింది. తుమకూరు జిల్లా స్థాయిలో 2వ ర్యాంక్ సాధించింది. 600మార్కులకు గాను 593 మార్కులు సాధించినట్లు లక్ష్మీ కుటుంబ సభ్యులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి

రొద్దం: మండల పరిధిలోని దొడగట్టకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త గోపి (40) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంపీటీసీ సభ్యుడు బాలాజీ, సర్పంచ్ వనజ, పలువురు నాయకులు, కార్యకర్తలు గోపి భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.



గోపి (ఫైల్)

ఘనంగా తుమ్మల మారెమ్మ ఉత్సవం



జ్యోతులతో మహిళా భక్తులు



ప్రత్యేక అలంకరణలో మారెమ్మ

గుడిబండ: పట్టణ సమీపంలో వెలసిన తుమ్మల మారెమ్మ జాతర మహోత్సవాలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి పసుపు కుంకుమ, నూతన వస్త్రాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం బియ్యం పిండితో చేసిన జ్యోతులను ఊరేగించారు.

మడకశిర: పట్టణంలోని కోటవీధిలో వెలసిన ఊరు మారెమ్మ అమ్మవారికి జ్యోతుల ఉత్సవాన్ని మంగళవారం భక్తులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన వంటి పూజలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. అనంతరం అమ్మవారికి హారతులు సమర్పించారు.



ఉష్ణోగ్రత సమాచారం

హిందూపురం	37.0
పెనుకొండ	39 .0
మడకశిర	37.0

నేడు మండల మీట్

మడకశిర: మడకశిర మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10.30 గంటలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జరుగుతుందని ఎంపీడీఓ సోనీబాయి తెలిపారు. ఎంపీపీ కవిత అధ్యక్షతన జరిగే సమావేశంలో శాఖల వారీగా సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. జెడ్పీటీసీతో పాటు అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కారు, మద్యం ప్యాకెట్లను చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

మడకశిర: ఎక్సైజ్ మొబైల్ పార్టీ, ఎన్‌ఫోర్స్ మెంట్ నియోజకవర్గంలో మంగళవారం విస్తృత దాడులు జరిపారు. మొబైల్ పార్టీ సీఐ గురునాథరెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ సత్యనారాయణ, ఎస్ఐలు శంకర్, వెంకటేష్ తదితరులు ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. గుడిబండ మండలం మద్దనకుంట క్రాస్‌లో ఇద్దరు వ్యక్తులు ఓ కారులో కర్ణాటకకు చెందిన 960 మద్యం ప్యాకెట్లను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నారు. వారిద్దరిని అరెస్ట్ చేసి కారు, కర్ణాటక మద్యం ప్యాకెట్లను సీజ్ చేశారు. మద్యం విలువ దాదాపు రూ.49,440 ఉంటుందని, నిందితులను కోర్టులో హాజరు పరిచినట్లు పేర్కొన్నారు.

హిందూపురం టౌన్: హిందూపురం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆకస్మిక దాడులు నిర్వహించి ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీ దుర్గయ్య తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. పరిగి మండలం పెద్దిరెడ్డిపల్లిలో ఆకస్మిక దాడులు నిర్వహించి కురుబ వెంకటేష్, ఊటుకూరు గ్రామంలో జగదీష్, సురేష్, చిలమత్తూరు మండలం కోడూరులో ఆదినారాయణ, చాగలేరులో నారాయణప్పలను అరెస్టు చేశామన్నారు. వారి నుంచి కర్ణాటకకు చెందిన 332 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.